

సీసీ కెమెరాలను మానిటర్ చేస్తున్న పోలీస్ సిబ్బంది



పూలచెట్లతో ఆహ్లాద వాతావరణంలో హనుమకొండ మోడల్ పీఎస్

# ఇస్మార్ట్ పోలీసింగ్

## కార్పొరేట్ హంగులతో హనుమకొండ మాడల్ పోలీస్‌స్టేషన్

కార్పొరేట్ హంగులతో ఆకట్టుకునే భవనం.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం.. ఎక్కడ ఏం జరిగినా చిటికెలో తెలిసేలా కమాండ్ కంట్రోలింగ్ వ్యవస్థ.. అనుక్షణం సీసీ కెమెరాలతో పర్యవేక్షణ.. '5ఎస్' సిస్టం, ఈ-ఫైల్స్ విధానంతో ఎప్పటికప్పుడు పనితీరులో మెరుగు.. ప్రజలు, ఫిర్యాదుదారుల్లో భయం పోయి స్వేచ్ఛా అనుభూతి కలిగేలా ఆహ్లాద వాతావరణం.. ఇలా ఫ్రెండ్లీగా ముందుకు సాగుతున్న స్మార్ట్ పోలీసింగ్‌కు హనుమకొండ పోలీస్‌స్టేషన్ 'మాడల్'గా నిలుస్తోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మూడు ఆదర్శ ఠాణాల్లో ఒకటైన ఈ స్టేషన్‌ను రూ.30లక్షలతో ఆధునీకరించగా స్మార్ట్ లుక్‌తో ఆకట్టుకోవడమే గాక అంతే స్మార్ట్‌గా ప్రజలకు చేరువై సత్వర న్యాయం, శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తోంది ఇక్కడి పోలీస్ యంత్రాంగం.

- సుబేదారి, అక్టోబర్ 2

- వేగంగా ప్రజలకు చేరువై.. సత్వర న్యాయమే లక్ష్యం
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం
- 5ఎస్ సిస్టం, ఈ-ఫైల్స్ విధానం అమలు
- కమిషనరేట్, హైదరాబాద్ సీసీకి అనుసంధానం
- అనుక్షణం సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- 5 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరేలా వ్యవస్థ
- విభాగాలవారీగా ప్రత్యేకంగా క్యాబిన్లు
- ఫిర్యాదుదారులకు సకల సౌకర్యాలు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో మెరుగైన సేవలు

హనుమకొండ పోలీస్‌స్టేషన్ అత్యాధునిక హంగులతో ఆకట్టుకుంటూ సరికొత్త విధానంతో వేగంగా ప్రజలకు సేవలు అందిస్తోంది. ఇక్కడ అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరుతో ముందుకుసాగుతున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 2018 సంవత్సరంలో మూడు (హనుమకొండ, నర్సంపేట, హసన్‌పర్తి) పోలీస్‌స్టేషన్లను మాడల్ స్టేషన్లగా తీర్చిదిద్దారు. ఇందులో హనుమకొండ స్టేషన్ ఒకటి. దీనిని సుమారు రూ.30లక్షల నిధులతో మాడల్‌గా స్టేషన్‌గా ఆధునీకరించారు. ఈ ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులు, విజిటర్స్‌కు ఇక్కడి వాతావారణం చూడగానే కార్పొరేట్ లుక్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం కనిపిస్తున్నది.

### పిటిషనర్లకు సకల సదుపాయాలు..

ఇన్‌స్పెక్టర్ చాంబర్, ఐదుగురు ఎస్సైలు, ఆరుగురు రైటర్లకు వేర్వేరుగా క్యాబిన్లు ఉన్నాయి. ఫైల్స్ అన్నీ కూడా సెక్టార్ వారీగా ర్యాక్‌లలో అమర్చుతారు. స్టేషన్ లోపల ఎక్కడ కూడా కాగితాలు కానీ చెత్త కానీ కనిపించదు. ప్రతి విభాగాన్ని ప్రతి రోజూ శుభ్రం చేస్తారు. నేరస్తులను అరెస్ట్ చేసిన తర్వాత స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించేందుకు లాకప్ గది, పిటిషనర్లు కూర్చునేందుకు వీలుగా చైర్స్, తాగేందుకు మంచినీరు, అలాగే టాయిలెట్స్ అన్ని కూడా మాడ్రన్‌గా ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చే మహిళల కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌తో పాటు టాయిలెట్స్, తదితరాలు ఏర్పాటు చేశారు.





ఫిర్యాదుదారుల కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్



రైటర్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యాబిన్లు

### సత్వర న్యాయమే మా లక్ష్యం..




హనుమకొండ స్టేషన్‌ను మాడల్ పోలీస్ స్టేషన్‌గా తీర్చిదిద్దిన తర్వాత చాలా మార్పు వచ్చింది. ఫిర్యాదు స్వీకరణ నుంచి దర్యాప్తు, నేరస్తులకు శిక్ష పడే వరకు ప్రతిదీ కంప్యూటరైజ్ ఈ-ఫైల్స్ పద్ధతిలో జరుగుతుంది. అలాగే శాంతిభద్రతల పరిరక్షణలో, దర్యాప్తు విషయాల్లో టెక్నాలజీ వినియోగిస్తున్నాం. నాతో పాటు కానిస్టేబుల్ వరకు ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపర్చుకుంటున్నం. ప్రతిది చట్టబద్ధంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుంది. బాధితులకు వీలైనంత వరకు త్వరగా న్యాయం జరగడమే మా లక్ష్యం. రోజుకు సగటున ఐదు నుంచి పది పిటిషన్లు వస్తాయి. పిటిషన్లు, నేర తీవ్రతను బట్టి విభజించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎన్.కరుణాకర్, ఇన్‌స్పెక్టర్, హనుమకొండ

### పక్కాగా ఈ-ఫైల్స్ విధానం..

ఫిర్యాదుదారులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన వెంటనే రిసిప్ట్ ఇచ్చి వివరాలను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైటర్స్ ఎఫ్ఐఆర్, దర్యాప్తు, రిమాండ్, చార్జిషీట్ కానీ, కోర్టుకు సమర్పించే సాక్ష్యాధారాలు, సమన్లు, ఫైనల్ రిపోర్టు.. ఇలా ప్రతీది కూడా పేపర్‌లెస్, ఈ-ఫైల్స్ రూపంలో కంప్యూటర్‌లో ఆప్‌లోడ్ చేస్తారు. అన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ఎప్పటికప్పుడు పిటిషన్‌దారుల సమాచారం, నేరస్తుల సమాచారం స్టేట్ క్రైమ్ రికార్డు బ్యూరో, నేర తీవ్రతను బట్టి నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరోకు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తారు. వర్టికల్స్ విధానంలో ఇతర స్టేషన్ల కంటే భిన్నంగా ప్రతి సెక్షన్‌కు ఇన్‌చార్జీలు ఉంటారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆన్‌లైన్‌లో నిత్యం మానిటరింగ్ చేస్తారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది పని విధానంలో స్మార్ట్‌గా, టెక్నాలజీతో స్పీడ్‌గా శాంతిభద్రల పరిరక్షణ, నేరాలను ఆరికట్టడం, నిందితులకు కోర్టు ద్వారా తగిన శిక్షలు పడేలా పనిచేయడమే మాడల్ పోలీస్‌స్టేషన్ ప్రధాన లక్ష్యం.



సిబ్బంది డ్యూటీ ఇన్‌చార్జి క్యాబిన్

### 5 ఎస్ సిస్టం..

జపాన్ దేశం మాదిరిగా చేసే పని విధానాన్ని స్మార్ట్‌గా చేసేందుకు '5 ఎస్' సిస్టంను పాటిస్తున్నారు. ఫైల్స్ అన్నీ భద్రపర్చడం, పరిశుభ్రంగా ఉంచడం, క్రమపద్ధతిలో వేగంగా పనిచేయడం, రోజురోజుకూ పనితీరును మెరుగు పరుచుకోవడం కోసం పోలీసింగ్ విధానంలో వస్తున్న సాంకేతిక మార్పులను అందిపుచ్చుకుంటారు.

ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఐదుగురు ఎస్సైలు, 17మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 45మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తారు. వీరిలో ఒక మహిళా ఎస్సై, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. మానసిక ప్రశాంతతతో పనిచేసేలా ఇక్కడ సౌకర్యాలు కల్పించడంతో పాటు స్టేషన్ వాతావరణం ఆహ్లాదం పంచేలా ఆవరణలో పూలమొక్కలు, చెట్లు పెంచారు.

### క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకునేలా..

మాడల్ స్టేషన్‌లో టెక్నాలజీ వినియోగం అనేది అత్యంత కీలకం. ఈ స్టేషన్ లోపల, బయట మొత్తం 23 సీసీ కెమెరాలను అమర్చారు. బయటినుంచి వచ్చే వ్యక్తులు, లోపల పోలీసుల పనితీరును పర్యవేక్షించేందుకు వరంగల్ కమిషనరేట్, హైదరాబాద్ డీజీపీ కార్యాలయ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. స్టేషన్ పరిధిలో ఎక్కడ నేరం జరిగినా, లేదా ఏదైనా సంఘటన జరిగినా డయల్-100కి కాల్ వచ్చిన వెంటనే పెట్రోకారు, బ్లూకోల్ట్స్, రక్షక్ వాహనాల్లో పోలీసులు 5 నిమిషాల్లో జెట్ స్పీడ్‌తో చేరుకుంటారు. స్టేషన్ పరిధిలోని ములుగురోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ జంక్షన్, గోపాల్‌పూర్ జంక్షన్, పబ్లిక్‌గార్డెన్, అంబేద్కర్ జంక్షన్, హనుమకొండ బస్‌స్టేషన్ చుట్టూ సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న 56 ఏరియాల్లో 36 కాలనీల ప్రజలకు మాడ్రన్‌గా పోలీసింగ్ సేవలు అందుతున్నాయి. 30 కాలనీల్లో 360 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి స్టేషన్‌కు అనుసంధానించారు. ఇటీవల నగరంలోని ఏడు అపార్ట్‌మెంట్లలో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల దృశ్యాలు.. హనుమకొండ స్టేషన్ పరిధిలో చోరీ జరిగిన కిషన్‌పుర ఏరియాలోని అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వీటి ఆధారంగానే దొంగలను గుర్తించి, ట్రాప్ చేసి పట్టుకున్నారు.

---

- మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- రాజకీయ, ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు
- మత విద్వేషాలు సృష్టిస్తూ ఓట్లడిగేవారిని నిలదీయండి
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- బొక్కలగడ్డలో కుట్టుమిషన్ ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభం
- ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



హనుమకొండ రాయపురలోని ఫంక్షన్ హాల్‌లో కుట్టుమిషన్లతో ముస్లిం మహిళలు

# మత సామరస్యానికి తెలంగాణ ప్రతీక

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 3: బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల వారికి సమప్రాధాన్యం కల్పిస్తుండడంతో తెలంగాణ రాష్ట్రం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రాయపురలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఆయాచోట్ల చీఫ్ విప్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. ఇతర పార్టీ మైనార్టీలను ఓట్ల కోసమే వాడుకున్నాయన్నారు. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ చేసిందేమిటో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ముస్లింలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని చెప్పారు. ఒక్కో విద్యార్థిపై రూ.1,20,000 వెచ్చించి నాణ్యమైన భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నదని గుర్తుచేశారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో తాను పని చేయడం వరంగా భావిస్తున్నానన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ తెచ్చి వైద్య రంగాన్ని సైతం బలోపేతం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మత విద్వేషాలు, మత కల్లోలాలు సృష్టిస్తూ ఓట్లు అడిగేందుకు వస్తున్న పార్టీల నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'అందుబాటులో ఉండి సేవచేసే నాయకుడిని ఎన్నుకోవాలి.. ఏ సమయంలో వచ్చి నా తలుపుతట్టినా మీకు నావంతు సహకారం అందించిన.. మీ కుటుంబంలో ఒకడిగా నన్ను ఆదరించండి' అని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, మేయర్ సుధారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆజీజ్‌ఖాన్

మున్ముందు టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి అవకాశాలు ఇప్పిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని దర్గాలో ఇప్పటికే గుసుల్ ఖానా నిర్మించామని, ములుగు రోడ్ సమీపంలో రూ.30లక్షలతో మరో గుసుల్ ఖానా నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, స్టేట్ ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా యూసుఫ్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, మైనార్టీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బొక్కలగడ్డలోని మైనార్టీల కుట్టుశిక్షణ కేంద్రం



హనుమకొండ బొక్కలగడ్డలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ వినయ్ భాస్కర్

### పండుగలా కుట్టుమిషన్ల పంపిణీ

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు రాయపురలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కుట్టు మిషన్లను చీఫ్ విప్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పండుగలా కొనసాగింది. ఇక్కడ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ మైనారిటీల కోసం షాదీ ముబరాక్, కుట్టుమిషన్ల పంపిణీ, రుణాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఓవర్సీస్ పథకం, రంజాన్ కానుకలు, ఇమామ్‌లకు రూ.5000 చొప్పున భృతి ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక్కటేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేసీఆర్ తోఫా పథకం ద్వారా నియోజవర్గంలోని 300 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందించామని చెప్పారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు 50 మందికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరో 50 మందికి కుట్టు మిషన్లు అందిస్తామని వివరించారు.